
సెంట్రల్ లైటింగ్ కోసం రహదారి మధ్యలో నిర్మిస్తున్న డివైడర్లు


రహదారి పక్కన నిర్మిస్తున్న మురుగు కాలువ

# మాటనిలబెట్టుకున్న సుంకె


పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు

- రూ.33 కోట్లతో చొప్పదండి పట్టణం అభివృద్ధి
- వేగంగా సెంట్రల్ లైటింగ్, రహదారి విస్తరణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

చొప్పదండి, అక్టోబర్ 29: చొప్పదండి మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయిన తర్వాత మొదటిసారిగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ విషయం ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో రూ. 33 కోట్లు మంజూరు చేశారు. దీంతో గుమ్లాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి సుమారు 4 కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్ పనులు చేపడుతున్నారు. ప్రధాన రహదారిని ఇరు వైపులా విస్తరించడంతో పాటు మధ్యలో డివైడర్లు, మురుగు కాలువలు నిర్మిస్తున్నారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నా



మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో పట్టణాభివృద్ధికి రూ.33 కోట్లు మంజూరు చేయించా. సెంట్రల్ లైటింగ్, మురుగు కాలువలు, రహదారి విస్తరణ, ఫుట్ పాత్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సెంట్రల్‌లైటింగ్ పనులు పూర్తయితే చొప్పదండి స్వరూపమే మారిపోతుంది. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఓపెన్ జిమ్‌లు కూడా ఏర్పాటు చేయించాం. తనపై నమ్మకంతో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటా. ఈ ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపిస్తే చొప్పదండి మున్సిపల్‌ను, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా. **- సుంకె రవిశంకర్, ఎమ్మెల్యే**

### పనులు వేగంగా సాగుతున్నాయి



ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చొప్పదండి పట్టణాభివృద్ధికి రూ. 33 కోట్లు మంజూరు చేయించారు. చొప్పదండి ప్రజల చిరకాల కోరిక అయిన సెంట్రల్ లైటింగ్ పనులు వేగంగా సాగుతున్నాయి. రహదారి విస్తరణ, మురుగు కాలువలు, డివైడర్ల నిర్మాణం పూర్తయితే పట్టణ రూపురేఖలు మారుతాయి. పట్టణంలో ప్రజలకు అన్ని వసతులు కల్పిస్తున్నం. బీఆర్ఎస్ హయాంలో చొప్పదండి ఎంతో అభివృద్ధి చెందింది. పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు రుణపడి ఉంటాం. **-గుర్రం నీరజ, మున్సిపల్ చైర్‌పర్సన్**

## సుంకె రవిశంకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి


కార్యకర్తలతో మాట్లాడుతున్న కృష్ణారావు

కొడిమ్యాల, అక్టోబర్ 29: చొప్పదండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు పిలుపునిచ్చారు. నమిలకొండ గ్రామంలో ఆదివారం ఆయన బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పునుగోటి కృష్ణారావు మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ పథకాలు, మ్యానిఫెస్టోను వివరించాలన్నారు. చొప్పదండి ఎమ్మెల్యేగా మళ్లీ సుంకె రవిశంకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్లు మేన్నేని రాజనర్సింగరావు, సర్పంచ్ మల్యాల అనిత-నరేశ్, ఎంపీటీసీ మల్యాల సుజాత-శోభన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జీవాలకు టీకాలు

రామడుగు, అక్టోబర్ 29: జాతీయ పశువుల వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా 2023-24 సంవత్సరానికి గానూ గొర్రెలు, మేకల్లో రోగ నిరోధక టీకాల (పీపీఆర్)ను మండలంలో సుమారు 40వేల జీవాలకు సోమవారం నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు వేస్తామని మండల పశువైద్యాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులు జీవాలకు పీపీఆర్ టీకాలు వేయించాలని సూచించారు.

## కార్యవర్గం

కొడిమ్యాల, అక్టోబర్ 29: మండల టీయూడబ్ల్యూజే(ఐజేయూ) కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పర్లపెల్లి జలేంధర్, ఉపాధ్యక్షుడిగా కొండూరి సురేశ్, కోశాధికారి కంచర్ల గంగాచారి, కార్యవర్గ సభ్యులుగా గడ్డం తిరుపతిరెడ్డి, కట్టెకోల రాజు, ఆకుల వెంకటేశం, పవన్, దేవేందర్, తదితరులను ఎన్నుకున్నారు.

## బీఆర్ఎస్ డోర్ టూ డోర్ ఓటరు సర్వే

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 29: మండలంలోని ఇరుకుల్ల, దుర్శేడ్, గోపాల్‌పూర్, చామనపల్లి, నగునూర్ గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఓటరు జాబితాలతో డోర్‌టూడోర్ సర్వే నిర్వహించారు. గ్రామంలోని కుటుంబ సభ్యుల వివరాలు, సెల్ నంబర్లు, కమ్యూనిటీ, తదితర వివరాలు సేకరిస్తున్నారు. దుర్శేడ్ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామాధ్యక్షుడు రామోజు తిరుపతి, రాజ్‌కమల్, భూతం రవీందర్, తదితరులు పాల్గొన్నారు. ఇరుకుల్లలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు బుర్ర రమేశ్ గౌడ్, కరీంనగర్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్లు నర్సయ్య, జువ్వాడి రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.


మధురానగర్ చౌరస్తాలో పూర్తయిన డబుల్ రోడ్డు

# తీరిన మధురానగర్‌వాసుల కష్టాలు

- డబుల్ రోడ్డు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ. 2.33 కోట్లు మంజూరు
- పూర్తయిన పనులు
- సజావుగా రాకపోకలు

గంగాధర, అక్టోబర్ 29: గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఏళ్లకు ఏళ్లుగా దుమ్ము దూళితో ఇబ్బందులు పడుతున్న చౌరస్తా ప్రజల కష్టాలు తీరాయి. మండల కేంద్రానికి వెళ్లే దారిలో 0/0 నుంచి 0/4 వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ. 2.33 కోట్లు మంజూరు చేయించారు. కాగా, కాంట్రాక్టర్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడంతో రాకపోకలు సజావుగా సాగుతున్నాయి.

### *వ్యాపార కేంద్రంగా చౌరస్తా*

మధురానగర్ చౌరస్తా వ్యాపార, వాణిజ్య కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నది. ఈ చౌరస్తా గంగాధర, రామడుగు, కొడిమ్యాల, బోయినపల్లి మండలాలకు ముఖ్య కేంద్రంగా ఉంది. వివిధ పనుల నిమిత్తం వేలాది మంది ప్రజలు చౌరస్తాకు వస్తుంటారు. ప్రతి రోజూ వందలాది వాహనాల్లో ప్రజలు వస్తుండడంతో చౌరస్తా నిత్యం రద్దీగా ఉంటుంది. మండల కేంద్రానికి వెళ్లే దారి అసంపూర్తిగా ఉండడంతో వేలాదిగా వచ్చే వాహనాలతో రోడ్డుపై దుమ్ము దూళి లేచి ప్రజలు, వ్యాపారులు, ఇబ్బంది పడేవారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గతేడాది రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రూ. 2.33 కోట్లు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించారు.

### *రహదారి నిర్మాణానికి రూ. 2.33 కోట్లు*

మండల కేంద్రానికి వెళ్లే దారిలో 0/0 నుండి 0/4 కిలోమీటరు వరకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.33 కోట్లు మంజూరు చేసింది. 2017లోనే సదరు రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.98 కోట్లు మంజూరు చేయగా అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డుకు ఒకవైపు పనులు పూర్తి చేసి మరో వైపు అసంపూర్తిగా వదిలివేశారు. దీంతో ఐదేళ్ల పాటు దుమ్ము దూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రజల ఇక్కట్లను గమనించిన ఎమ్మెల్యే రవిశంకర్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం రూ. 2.33 కోట్లు మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఏళ్లుగా తాము పడుతున్న ఇబ్బందులు తీరాయని చౌరస్తా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు, ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

### సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రవిశంకర్‌కు కృతజ్ఞతలు



మండల కేంద్రానికి వెళ్లే దారిలో 0/0 నుంచి 0/4 కిలోమీటరు వరకు రహదారి పనులు అసంపూర్తిగా ఉండడంతో ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడ్డాము. ప్రమాదాలు జరిగి పలువురు గాయపడ్డారు. చౌరస్తాలోని ప్రజలు, వాహనదారుల ఇబ్బందులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు విన్నవించగా, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా రోడ్డు నిర్మాణానికి రూ. 2.33 కోట్లు మంజూరు చేయించారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే రవిశంకర్‌కు మధురానగర్ ప్రజల తరపున కృతజ్ఞతలు.

**-వేముల అంజి, మధురానగర్**

### దుమ్ముతో ఇబ్బందులు పడ్డాం



చొప్పదండి నియోజకవర్గానికి ముఖ్య కేంద్రంగా ఉన్న మధురానగర్ చౌరస్తాకు వివిధ పనుల నిమిత్తం వేలాది మంది ప్రజలు వస్తుంటారు. నిత్యం వచ్చే వందలాది వాహనాలతో చౌరస్తా రద్దీగా ఉంటుంది. రోడ్డుపై లేచే దుమ్ము, దూళితో ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం చౌరస్తాలో డబుల్ రోడ్డు పనులు పూర్తి కావడంతో ఇన్నాళ్లకు మా కష్టాలు తీరాయి. చౌరస్తా ప్రజల ఇబ్బందులను తీర్చిన సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రవిశంకర్‌కు రుణపడి ఉంటాం.

**-వేముల భాస్కర్, మధురానగర్**

### నిత్యం దుమ్ముతో సహవాసం చేశాం



రోడ్డు నిర్మాణ పనులను గతంలో అధికారుల అసంపూర్తిగా వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. మధ్యాహ్నం సమయంలో కూడా రోడ్డుపై లేచే దుమ్ముతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోయేవి. నిత్యం దుమ్ముతో సహవాసం చేశాం. రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నిధులు మంజూరు చేయించి మా కష్టాలను తీర్చారు. మా ఇబ్బందులను తీర్చిన సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రవిశంకర్‌ను మరచిపోము. **-పెంచాల చందు, మధురానగర్**